క్లుప్తంగా

బఫర్‌జోన్‌లో బోరు తవ్వకానికి యత్నం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఊరకుంట చెరువు బఫర్‌జోన్‌లో బుధవారం ఓ వ్యక్తి బోరు వేసేందుకు యత్నించగా 24వ వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి అడ్డుకున్నారు. బఫర్‌జోన్‌లో నిర్మాణాలకు, బోర్లు వేసేందుకు ఎలాంటి అనుమతులు లేవని వివరించారు. అదే సమయానికి వార్డు అధికారి సైతం అక్కడికి చేరుకొని బోరు వేసేందుకు అనుమతులు లేవని చెప్పటంతో వెనుదిరిగి వెళ్లారు. మంగళవారం ఇదే చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో బోరు వేస్తుండగా అడ్డుకున్న విషయం తెలిసిందే. ఆ ఘటన జరిగిన 24గంటలు జరగక ముందే బఫర్‌జోన్‌లో బోరు వేయటానికి ప్రయత్నించటం అధికారుల వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఊరకుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో బోర్లు వేసేందుకు ప్రయత్నిస్తే అడ్డుకుని తీరుతామని 23వ వార్డు కౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్, 24వ వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో షబే ఖదర్ వేడుకలు



స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పలు మసీదుల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు షబే ఖదర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా కేంద్రం న్యూప్రేమ్‌నగర్‌లోని అన్వారే మదీనా మసీద్‌లో షబే ఖదర్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. రహెమతుల్లా ఖాద్రీ ధార్మిక సందేశం ఇచ్చారు. రంజాన్ నెలలోనే పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించిందన్నారు. రంజాన్ మాసంలోని ఐదు రాత్రుల షబే ఖదర్ వేడుకల్లో దువా చేయాలని, ఖురాన్‌ను పఠించాలని కోరారు. అనంతరం పలువురు ఆలపించిన నాతేషరీఫ్‌లు అలరించాయి. ఎదిరెలోని జామీయ మసీద్‌లో నిర్వహించిన వేడుకల్లో ప్రముఖ ధార్మికవేత్త మౌలానా తస్లీం అన్సారీ సందేశమిచ్చారు. హాఫెజ్ ఫేరోజ్, మజీద్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ హకీం, కోశాధికారి అజీజ్‌వుల్లా పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీకి రూ. 48 కోట్లు కేటాయించినందుకు ఎన్‌ఎస్‌యూఐ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పీయూ అధ్యక్షుడు వంశీకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, యూనివర్సిటీలకు అధిక నిధులను కేటాయించడం గొప్పవిషయం అన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ, శేఖర్, స్వాతి, పూజిత పాల్గొన్నారు.

నవాబుపేట తైబజార్ రూ.8 లక్షలు

నవాబుపేట: నవాబుపేట తైబజార్ వేలం పాట బుధవారం కొనసాగింది. స్పెషల్ అధికారి తహసీల్దార్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన అంజనేయులు రూ.8.60 లక్షలకు తైబజార్‌ను వేలం పాటలో దక్కించుకున్నారు. కాగా గత ఏడాదితో పోలిస్తే తాజాగా దాదాపు లక్ష రూపాయలు అదనంగా వేలం పాట సాగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం తైబజార్ వసూలు చేయాలని రైతులను ఇబ్బందులు పెట్టరాదన్నారు. వ్యాపారులు, కూరగాయల విక్రయదారులు సైతం తైబజార్ వేలం పాటదారుడికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు బద్రు నాయక్, నరేష్, లక్ష్మయ్య, గ్రామస్తులు సత్యం, రాజేష్, నర్సింహ, వెంకటయ్య, మణికంఠ ఉన్నారు.

సామగ్రి విక్రయ ఘటనపై విచారణకు ఆదేశాలు

జడ్చర్ల టౌన్: నిరుపయోగంగా, వినియోగంలోని లేని కంప్యూటర్ సామగ్రిని పాతసామగ్రి విక్రయదుకాణానికి తరలించిన ఘటనపై విచారణ చేయాలని ఎంఈఓ మంజులాదేవిని ఆదేశిస్తూ డీఈఓ ప్రవీణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. మున్సిపాలిటీ పరిధిలోని హరిజనవాడ జెడ్పీహైస్కూల్‌లో జరిగిన ఘటనపై ప్రధానోపాధ్యాయుడు గోవింద్ నాయక్ పాత్రపై విచారణ చేయాలని ఆయన ఆదేశించారు. విచారణ అధికారి ఎంఈఓ పూర్తిస్థాయిలో విచారణ జరిపించి సరైన నివేదిక ఇవ్వాలని గ్రావిటి అసోసియేషన్ కార్యదర్శి భరత్, బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర ఇన్‌చార్జి సంతోష్‌నాయక్, పర్శనాయక్ డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- కలెక్టర్ విజయేందిర బోయి
- 'పది' పరీక్ష కేంద్రాల తనిఖీ



తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మిడ్జిల్: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనులను మార్చి లోపల పూర్తిచేయాలని, పనులు జరిగే చోటకూలీలకు తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న డబ్బాలను తొలగించాలని ప్రహరీ నిర్మాణానిఖ ప్రతిపాదనలను పంపాలని అధికారులకు సూచించారు. అంతకంటే ముందు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, చైతన్య భారతి ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. సెంటర్లకు ఎవరికీ సెల్‌ఫోన్లు అనుమతి లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు..సమావేశంలో తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ: గీతాంజలి, ఎంపీఓ జగదిశ్వర్,అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి' నిధులతో సీసీ రోడ్లు



గండేడ్: ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు వేస్తున్నట్లు ఎంపీడీఓ దేవన్న అన్నారు. ఈజీఎస్ నిదులు రూ.20 లక్షలతో మండలంలోని అంబస్‌పల్లిలో సీసీరోడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్లు వేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ఈజీఎస్ నిధులతో రోడ్లు వేస్తున్నామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ఉమాదేవి, సుదర్శన్‌రావు, చెన్నారెడ్డి, బాలయ్య, అశన్న, లక్ష్మారెడ్డి, నర్సింహారెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రాజాపూర్: మండలంలోని రాయపల్లి గ్రామంలో బుధవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ గంగాధర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సీసీరోడ్ల ఏర్పాటుతో ఎన్నో సమస్యలు తీరుతాయన్నారు. ఎంపీఓ వెంకట్‌రాములు మాట్లాడుతూ పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మాజీ ఏఎంసీ డైరెక్టర్ కిష్టారం మల్లేష్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి రవిప్రకాష్, నాయకులు లింగంయాదవ్, నర్సింలుగౌడ్, పాశం నర్సింహులు పాల్గొన్నారు.

దమాయపల్లిలో..

కోయిల్‌కొండ: మండలంలోని దమాయపల్లి గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. నాయకులు జీ.రవీందర్, వై.విద్యాసాగర్, సత్యపాల్‌రెడ్డి, రవి నాయక్, శేఖర్, రామస్వామి, వెంకటేష్, బోయ అంజనేయులు, శివకుమార్, రవికుమార్, రాజునాయక్, చెన్నయ్య, రంగ, గౌస్‌పాష, పుల్లన్న పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

చిన్నచింతకుంట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి సంఘం సభ్యులు కృషి చేయాలని వ్యవసాయ సహకారం సంఘం జిల్లా మానిటరింగ్ అధికారి దివ్య, అప్పంపల్లి సహకారం సంఘం అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కౌకుంట్ల మండలం అప్పంపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం కేంద్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. అందుకు సహకార సంఘాలనుంచి రైతులకు రుణాలను అందిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించడంలో సిబ్బంది విఫలమవుతుందని సహకార సంఘం డైరెక్టర్ కుర్వ రమేష్ ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల వద్ద మంచినీరు, నీడ టెంట్లు ఏర్పాటు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఐదేళ్ల నుంచి సంఘంలో అభివృద్ధి పనులు లావాదేవీలపై శ్వేత పత్రం విడుదల చేయాలని సభను కోరారు. సహకార సంఘం డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, ఆశీర్వాదం, బి.మాసన్న, కే.రాములు, సీతమ్మ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రాజాపూర్: అనుమతుల్లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. మండలంలోని కుత్నేపల్లి, రాఘవాపూర్ గ్రామాల్లో తమ సిబ్బంది బీట్ నిర్వహిస్తుండగా ఇప్పటూర్ గ్రామశివారులోని చౌటపల్లి చెందిన కలాల్ లింగంగౌడ్, దుబ్బరామస్వామి తమ ట్రాక్టర్‌లో ఇసుకలోడ్‌తో సిబ్బందికి ఎదురువచ్చాడు. ట్రాక్టర్‌ను ఆపి అనుమతి పత్రాలు అడగటంతో లేవని చెప్పగా ట్రాక్టర్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక డంప్‌లు సీజ్

చిన్నచింతకుంట: మండలంలోని గోప్యనాయక్‌తండాలో కొందరు అక్రమార్కులు తండా సమీపంలోని చిన్నవాగునుంచి ఇసుకను తరలించి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో డంప్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎల్లయ్య అక్కడికి చేరుకొని ఇసుకను పరిశీలించారు. గ్రామానికి చెందిన నన్యానాయక్ ఇంటి సమీపంలో పది ట్రాక్టర్ల ఇసుక, బుజ్జమ్మ వ్యవసాయ పొలంలో ఆరు ట్రాక్టర్లు మొత్తం 16ట్రాక్టర్ల ఇసుక డంప్‌లు ఉన్నట్లు గుర్తించారు. అక్రమ ఇసుక డంపుపై పంచనామా నిర్వహించి ఇసుకను సీజ్ చేశారు. ఆర్‌ఐ తిరుపతయ్యలతో పాటు పలువురు ఉన్నారు.

ధూప, దీప నైవేద్య అర్చక సంఘాన్ని బలోపేతం చేద్దాం



ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న డీడీఎన్‌ఎస్ సంఘం ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలో ధూప, దీప నైవేద్య అర్చక సంఘాన్ని మరితగా బలోపేతం చేద్దామని డీడీఎన్‌ఎస్ జిల్లాల ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ కళ్యాణ మండపంలో ధూప, దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హక్కుల సాధన కోసం ధూప, దీప నైవేద్య అర్చక సంఘం సభ్యులు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధూప, దీప నైవేద్య అర్చకుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దేవాలయాల్లో ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించుకుందామని అన్నారు. డీడీఎన్‌ఎస్ ఉమ్మడి జిలాల అధ్యక్షులు జి.రవికుమార్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగం మహేష్, కుమారస్వామి, గౌరవాధ్యక్షులు నరసింహరావు, మహిళా అధ్యక్షురాలు రామేశ్వరమ్మ, రాజ్‌కుమార్, మల్లికార్జున్, నారాయణపేట జిల్లా జోషి రామాచారి, వనపర్తి జిల్లా అధ్యక్షులు లక్ష్మీకాంతాచార్యులు, రవీందర్‌రావ, శ్రీహరి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



వెన్నాచేడ్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్న మిషన్ భగీరథ ఎస్‌ఈ జగన్మోహన్

గండేడ్: గ్రామాల్లో వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మిషన్ భగీరథ ఎస్‌ఈ జగన్మోహన్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని వెన్నాచేడ్‌లో పర్యటించారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు ఆయన గ్రామాన్ని సందర్శించారు. మాడల్ స్కూల్ వద్ద గల వాటర్ ట్యాంక్‌కు నీరు సక్రమంగా ఎక్కడం లేదని, దీంతో సరిపోయినంతగా నీరు రావడం లేదని స్థానికులు తెలిపారు. దీంతో ఎస్‌ఈ మాట్లాడుతూ వేసవిలో సమస్య రాకుండా గ్రిడ్ వాళ్లతో మాట్లాడి నీరు ఎక్కువగా చూసేలా చూస్తామని అన్నారు. డీఈ రంజిత్‌రెడ్డి, ఏఈ రామకృష్ణ పాల్గొన్నారు.

పండుగలు సోదరభావానికి ప్రతీకలు



వెన్నాచేడ్‌లో ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పండుగలు సోదరభావానికి ప్రతీకలు అని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం రాయిచూర్ రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఆయన రంజాన్ ఉపవాస దీక్ష ఉన్న ముస్లింలకు ఇఫ్తారు ఏర్పాటు చేశారు. పలువురికి ఆయన ఖజూర్, పండ్లు తినిపించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మీడియా సెల్ కన్వీనర్ సీజు బెనహర్, లక్ష్మణ్, పీర్ సాదిక్, షేక్ ఉమర్, శ్యాంబాబు పాల్గొన్నారు.

వెన్నాచేడ్‌లో ఇఫ్తార్

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్‌లో ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. మసీద్ కమిటీ చైర్మన్ షేక్ అలీ, పుల్లారెడ్డి, అనంత లక్ష్మారెడ్డి, రమేష్, చిన్నయ్య, గోపాల్, పులిందర్‌రెడ్డి, అంతర్‌గాని రాములు, ఇజాజ్, బాబు, రవీందర్, నర్సింహులు పాల్గొన్నారు.

క్రైస్తవుల కొవ్వొత్తుల ప్రదర్శన



మహబూబ్‌నగర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పట్ల సంతాపకంగా బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో క్రైస్తవ పాస్టర్లు, సంఘాల ప్రతినిధులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమాస్పదంగా మరణించారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించి క్రైస్తవ లోకానికి న్యాయం చేయాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పాస్టర్ ప్రవీణ్‌కు నివాళులు

జడ్చర్ల టౌన్: జడ్చర్ల యునైటెడ్ క్రిస్టియన్స్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జడ్చర్ల ఫ్లైఓవర్ వద్ద విజయవాడ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన పాస్టర్ ప్రవీణ్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మరణం హత్య అయితే సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎంబీ చర్చి వరకు ర్యాలీ నిర్వహించిన సమావేశం ఏర్పాటు చేశారు.

గోకల్యాణాన్ని విజయవంతం చేద్దాం

హన్వాడ: వచ్చేనెల 4న నారాయణపేట జిల్లా బిజ్వార్‌లో జరిగే గోకల్యాణాన్ని విజయవంతం చేద్దామని ఆదిత్యపరాశ్రీస్వామి శిష్యుడు జంబులయ్య పిలుపునిచ్చారు. బుధవారం మం డలకేంద్రంలో ఇందుకు సంబంధించిన కపరత్రాన్ని విడుదల చేశారు. లోక కల్యాణార్థం చేపట్టే ఈ కార్యక్రమానికి ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలన్నారు. శ్రీఅంబాత్రయ క్షేత్రంలో జరిగే గోకల్యాణాన్ని భక్తులు తిలకించి స్వామివార్ల ఆశీర్వాదం పొందాలని ఆయన కోరారు. ఆదిత్యపరాశ్రీ భక్తులు కేశవులు, వెంకటయ్య, రాములు, బాలకిష్టయ్య, ఆంజనేయులు, శ్రీనివాసులు, బాల్‌రాజు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో పాడవుతున్న రోడ్లు

నవాబుపేట: నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్‌తో లారీలు ప్రయాణించడంతో రోడ్లన్నీ పాడవుతున్నాయని చౌడూర్‌కు చెందిన అమరేశ్వర్‌తో పలువురు గ్రామస్తులు బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని చౌడూర్ నుంచి ఉడిత్యాల్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీకి పలుగురాళ్ల సరఫరా అవుతున్నట్లు తెలిపారు. రాత్రి వేళలో పదుల సంఖ్యలో ఒకేసారి లారీలు గ్రామం మీదుగా తరలివెళ్తున్నాయన్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రిజర్వేషన్లు కల్పించాకే డీలిమిటేషన్ చేయాలి



మాట్లాడుతున్న కృష్ణయాదవ్

జడ్చర్ల టౌన్: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాకే డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని బీసీ జాగృతిసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో నిర్వహించిన బీసీ జాగృతి ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో రిజర్వేషన్ల సాధనకై ఉద్యమకారులు, మేధావులు, విద్యావంతులు దశాబ్దాలుగా పోరాడుతున్నా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు పట్టించుకోవటం లేదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నాటికి స్థానాలను పెంచటానికి సిద్ధమవుతున్న మోదీ ప్రభుత్వం ముందుగా కుల గణన చేసి బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి తర్వాతే డీలిమిటేషన్ చేయాలన్నారు. నాయకులు నిరంజన్, నర్సింహులు, లింగంపేట శేఖర్, సురభి విజయ్‌కుమార్, గోపాల్, శివరాములు, కట్ట మురళి, ధర్మసమాజ్ పార్టీ నాయకులు రంగయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించేందుకు అంగీకారం

సాక్షి ఎఫెక్ట్..

జడ్చర్ల టౌన్: ఏరియా ఆస్పత్రిలో పనిచేసే కార్మికుల ఎట్టకేలకు జీతాలు చెల్లించేందుకు వైద్య ఆరోగ్యశాఖ డీసీహెచ్‌ఎస్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.చంద్రకళ, శ్రీశాంతి ఏజెన్సీ నిర్వాహకుడు శ్రీకాంత్‌రెడ్డి గురువారం అంగీకరించారు. బుధవారం సూపరింటెండెంట్ చాంబర్‌లో ఏజెన్సీ కాంట్రాక్టర్, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్, కార్మికుల మధ్య జరిగిన చర్చలు సఫలం అయ్యాయి. ఫిబ్రవరి 13న కార్మికుల జీతాల బడ్జెట్ విడుదలైనప్పటికి 45రోజులుగా వారికి చెల్లించకపోవటం పట్ల మెరుపు సమ్మెకు దిగారు. ముఖ్యంగా సూపరింటెండెంట్, కాంట్రాక్టర్ మధ్య సమన్వయ లోపం కారణంగానే జీతాల చెల్లింపు జాప్యం జరిగింది. మరో మూడు రోజుల్లో రెండు ప్రధాన పండగలు ఉగాది, రంజాన్‌లు వస్తున్నాయి. ఈ సమయంలో కార్మికులకు జీతాలు ఆపటం సరికాదని, పెండింగ్‌లో ఉన్న ఐదునెలల జీతం చెల్లిస్తామని వారు ప్రకటించారు. 'సాక్షి'లో వచ్చిన కథనానికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పందించారు. కార్మికులకు జీతాలు చెల్లించాలని డీసీహెచ్‌ఎస్, సూపరింటెండెంట్ డా.చంద్రకళను ఆదేశించారు. ఆయన ఆదేశాలతో వారికి జీతాల చెల్లింపునకు నిర్ణయం తీసుకున్నారు.

క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రీడల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. భగీరథ కాలనీలోని మైనార్టీ బాలికల గురుకుల 1, 2, 3 పాఠశాల సముదాయంలో కింగ్‌షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో బుధవారం కరాటే శిక్షణ తీసుకున్న బాలికలకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొత్వాల్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడం కోసం ఇటీవలే గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆత్మ రక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని కోరారు. కొన్నేళ్ల నుంచి మాస్టర్ జహంగీర్‌పాష ఖాద్రీ విద్యార్థులకు, యువతకు కరాటే శిక్షణ ఇస్తుండడం అభినందనీయమని అన్నారు. కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ మాట్లాడుతూ బెల్టు గ్రేడింగ్‌లో ప్రతిభచాటి గ్రాండ్ చాంపియన్‌షిప్ కె.మమత ప్రథమ, అప్సరబేగం ద్వితీయ, కె.ప్రణీత తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వైట్ టూ బ్లూబెల్టు ప్రమోషన్‌ను మమత, అప్సర బేగం, కీర్తన, సారిక, ప్రణీత పొందినట్లు తెలిపారు. వైట్ టూ ఎల్లో బెల్టును 18 మంది, వైట్ టూ ఆరెంజ్ బెల్టును 39 మంది సాధించారన్నారు. అనంతరం కొత్వాల్ బాలికలకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. నాయకులు జాకీర్, ఆర్‌ఎల్‌సీ ఖాజా బాహుద్దీన్, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎండి.సలీం, జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధి చెన్న వీరయ్య, ఆయా గురుకులాల ప్రిన్సిపాళ్ల లక్ష్మీ, శ్రీదేవి, సురేఖ, పీఈటీలు ఫాతిమా బేగం, అనూష, చైతన్య, రాణి, బ్లాక్‌బెల్టు విద్యార్థులు మారియ బేగం, నేహాఫాతిమా పాల్గొన్నారు.

జేపీఎన్‌సీఈలో క్యాంపస్ సెలక్షన్స్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీఈ కళాశాలలో బుధవారం క్యాంపస్ సెలక్షన్స్ వివిధ కంపెనీల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈమేరకు మొత్తం 250 మంది విద్యార్థులు సెలక్షన్స్‌కు హాజరైతే 111 మంది ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ రవికుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కురుమూర్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

జడ్చర్ల టౌన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని కెరీర్ కన్సల్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మానేని రోహిత్ శర్మ పిలుపునిచ్చారు. పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కెరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో విద్యార్థులు భవిష్యత్‌లో ఏమి చదవాలో అవగాహన కల్పించారు. డిగ్రీ తర్వాత ఏ కోర్సు చేయాలి, దానివల్ల ప్రయోజనాలు ఏమిటనే అంశాలపై క్లుప్తంగా వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సుకన్య మాట్లాడుతూ ప్రతిఒక్కరిలో ఏదో ప్రతిభ దాగి ఉంటుందని, దానిని ముందుగా గుర్తించాలన్నారు. కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ రాఘవేంద్రరెడ్డి, అధ్యాపకులు పుష్పలత, సతీష్‌రెడ్డి, నర్సింమ్మ, జగన్, ఆదిల్, శివుడు, కృష్ణవేణి పాల్గొన్నారు.

షేక్‌పల్లిలో కంటి వైద్యశిబిరం

మహమ్మదాబాద్: ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా తమ కంటి సమస్యలు పరిష్కరించుకోవాలని మాజీ ఎంపీపీ శాంతీబాయి తెలిపారు. బుధవారం మండలంలోని షేక్‌పల్లిలో కమల హాస్పిటల్ వాళ్లు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య శిబిరాల ద్వారా చికిత్సలు చేయించుకుంటే మందులు, కంటి అద్దాలు అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించుకోవచ్చాన్నారు. వైద్యుడు రాజు, గ్రామ కార్యదర్శి ప్రవళిక, మోసిన్‌అలీ, రాజేందర్, యూసూఫ్, రవి, భీమమ్మ పాల్గొన్నారు.

అడ్డాకులలో తైబజారు వేలం

అడ్డాకుల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం తైబజారు వేలం నిర్వహించారు. ప్రతి బుధవారం వారాంతపు కూరగాయల సంత జరుగనున్న నేపథ్యంలో ఈ ఏడాదికి సంబంధించిన తైబజారు వేలాన్ని తహసీల్దార్ శేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సరస్వతి ఆధ్వర్యంలో వేలం పాట జరిగింది. గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ రూ.6.42 లక్షలకు వేలంలో తైబజారు దక్కించుకున్నారు.

నేడు పశువుల సంత వేలం

కోయిల్‌కొండ: స్థానిక గ్రామ పంచాయతీలో గురువారం మండల ప్రత్యేకాధికారి అధ్యక్షతన 2025–26 సంవత్సరానికి పశువుల సంత వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనాలని కోరారు. వేలంలో పాల్గొనే వారు రూ.2500ను పంచాయతీలో డిపాజిట్ చేయాలని సూచించారు.

బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



భూత్పూర్: రెండు రోజుల క్రితం దేవరకద్ర నియోజక వర్గంలో వివిధ గ్రామాల్లో వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ మాజీ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ నివాసంలో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో రూ.2 లక్షలు రుణమాఫీ పూర్తయిందని తెలపడం సిగ్గుచేటని ఆయన ఆరోపించారు. రైతులు వరి పంట ఎండుతుండటంతో పశువులకుమేతగా వదులుతున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మండలం లోని రేగడిగడ్డతండా, మాచన్‌పల్లితండా, లాల్యానాయక్‌తండాల్లో ఆపార్టీ గ్రామ కమిటీలకు నూతన అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతులకు అండగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో 25లక్షల కుటుంబాలను రుణవిముక్తి చేసిన ఘనత దేశంలో ఏరాష్ట్రంలో జరగలేదని అన్నారు. నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీల అధ్యక్షులు అందరిని కలుపుకుపోయి పా ర్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు.

లింగంపల్లిలో అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పనులు

నవాబుపేట: మండలంలోని లింగంపల్లిలో అండర్ డ్రైయినేజీ పనులను బుధవారం డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి ప్రారంభించారు. దాదాపుగా రూ.40 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, రాజశేఖర్, అంజనేయులు, కుమార్, నర్సింహులు, వెంకటేష్ ఉన్నారు.

నెట్‌బాల్ జాతీయ టోర్నీకి టీజీఎంఆర్‌ఎస్ విద్యార్థులు

జడ్చర్ల టౌన్: ఈనెల 28 నుంచి హర్యానాలో జరిగే ఫస్ట్ సబ్ జూనియర్ జాతీయ మిక్స్‌డ్ నెట్‌బాల్ టోర్నీకి జడ్చర్ల టీజీఎంఆర్‌ఎస్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయినట్లు ఎస్‌ఓ తెలిపారు. ఖాజ, ఆరీఫ్, సాయికుమార్, అజ్మత్, అఫ్సర్, వంశి ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ పారిజాత, ఉపాధ్యాయబృందం అభినందించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

భూత్పూర్: రాజీవ్ వికాస్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అంగవైకల్యం కలిగిన వారు కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవా కేంద్రాల్లో ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 50వేల వరకు రుణానికి వందశాతం సబ్సిడీ, 50వేల నుంచి లక్ష వరకు 90శాతం, రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు 80శాతం, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అభ్యర్థులు ఆయా శాఖల కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై రుణాలు పొందాలని సూచించారు.